22న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈనెల 22వ తేదీన జిల్లాకు రానున్నారు. పర్యటనలో భాగంగా వంశధార ఎడమ కాలువ, హిరమండలం రిజర్వాయర్ పనులను తనిఖీ చేస్తారు. అనంతరం, జిల్లా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ఆరోజు మధ్యాహ్నం విలేకరుల సమావేశ అనంతరం విజయనగరం బయలుదేరుతారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల

- జిల్లాలో 543 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- స్పెషల్ టీచర్స్ పోస్టులకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నిరుద్యోగ డిఎస్‌సి అభ్యర్థులను ఊరిస్తున్న మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఎట్టకేలకు ఆదివారం విడుదల చేశారు. రెండు రోజుల కిందటే ఎపి రెసిడెన్షియల్, గురుకులాలు, ఆదర్శ పాఠశాలల్లో ప్రత్యేక ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల కాగా, తాజాగా జిల్లా స్థాయి ఉపాధ్యాయ పోస్టులతో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వేర్వేరుగా మెగా డిఎస్‌సి-2025 పేరిట నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయగా, జిల్లాలో 458 జిల్లాస్థాయి పోస్టులు, 85 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్, వికలాంగుల శాఖ , జువైనల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌తో పాటు ఎపి మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలు, బిసి వెల్ఫేర్ స్కూల్స్, గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఇప్పటికే డిఎస్‌సికి సంబంధించిన పూర్తి సమాచారం, సంబంధిత జిఒలు, జిల్లా వారీగా ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, పరీక్ష షెడ్యూల్, సిలబస్, ఇతర వివరాలను పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ https://apdsc.apcfss.inలో అందుబాటులో ఉంచారు. అర్హులైన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://apdsc.apcfss.in/ https://apdsc.apcfss.in/RegistrationForm ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఈనెల 20 నుంచి మే 15వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా ఫీజుల చెల్లింపు, దరఖాస్తుల స్వీకరణ మొదలు కానుంది. మే 20 నుంచి నమూనా పరీక్షలు నిర్వహించనున్నారు. మే 30 నుంచి అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలు కల్పించనున్నారు. జూన్ 6 నుంచి జులై 6వ తేదీ వరకు పలు దశల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్‌లో షెడ్యూల్‌ను పొందుపరిచారు. పరీక్షలన్నీ పూర్తయిన రెండో రోజున ప్రాథమిక 'కీ' విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. తర్వాత ఏడు రోజులపాటు అభ్యంతరాల స్వీకరణ, గడువు ముగిసిన ఏడు రోజుల తర్వాత తుది కీ విడుదల చేయనున్నారు. ఆ తర్వాత వారం రోజులకు మెరిట్ జాబితాను వెల్లడించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు తప్పనిసరిగా కొన్ని ధ్రువీకరణ పత్రాలను తప్పక అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందు వాటిని సిద్ధం చేసుకుని ఆన్‌లైన్ ప్రక్రియను మొదలు పెట్టాల్సి ఉంటుంది. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, పిజి, డిఇడి, బిఇడి సర్టిఫికేట్, ఎపి టెట్ ధ్రువీకరణ పత్రం, స్టడీ వివరాలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, తప్పనిసరిగా ఉండాలి. వాటితో పాటు ఆన్‌లైన్‌లో పొందుపరిచినప్పుడు ఇమెయిల్ ఐడి, వ్యక్తిగత ఫోన్ నంబరు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సంతకం తప్పనిసరిగా స్కాన్ చేసి సిద్ధం చేసుకోవాలి. ఆ తర్వాత ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుని నిర్దేశించిన ఫీజును చెల్లించాల్సి ఉంటుంది.

మెగా డిఎస్‌సి అప్లికేషన్లో మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో అభ్యర్థి వ్యక్తిగత సమాచారం, రెండో విభాగంలో విద్యార్హతలు, అర్హత కలిగిన పోస్టుల వివరాలు, మూడో విభాగంలో ఫీజు చెల్లింపు వివరాలను పొందుపరిచారు. ఆన్‌లైన్ చేస్తున్న సమయంలో ఒకటి, రెండు విభాగాల్లోని అంశాలను అభ్యర్థి ఎన్నిసార్లు అయినా ఎడిట్ చేసుకునేందుకు వీలుంటుంది.

దరఖాస్తు ఫారంలోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకున్న తర్వాత మాత్రమే సబ్‌మిట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. మూడు విభాగాల్లోని వివరాలను నింపిన తర్వాత అర్హత కలిగిన, ఎంపిక చేసుకున్న పోస్టులను బట్టి ఒక్కో పోస్టుకు రూ.750 చొప్పున ఫీజు చెల్లించాలి. మూడో విభాగంలో ఎలాంటి సవరణలకు అవకాశం ఉండదు. గతేడాది ఫిబ్రవరిలో ఎన్నికల ముందు ఇచ్చిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కొత్తగా ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే సమయంలో ఆ వివరాలను పొందుపరిచి సబ్మిట్ చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది.

టెట్ అర్హత మార్కులు

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒసి అయితే 60 శాతం అంటే కనీసం 90 మార్కులు సాధించి ఉండాలి. బిసి అభ్యర్థులకు 50 శాతం అంటే 75 మార్కులు, ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులైతే 40 శాతం అంటే 60 మార్కులు టెట్‌లో పొంది ఉండాలని నోటిఫికేషన్‌లో వెల్లడించారు. అర్హత గల పోస్టులకు అభ్యర్థి తన ఆసక్తి మేరకు వరుసక్రమంలో ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి పోస్టుల ప్రాధాన్యతా క్రమాన్ని ఆప్షన్లు ఎంపిక చేసుకున్న తర్వాత మార్చుకోవడానికి వీలుండదు. అందువల్ల ఆప్షన్ ఎంపిక సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. 2024 జూలై ఒకటో తేదీ నాటికి అభ్యర్థుల వయసు 18 ఏళ్ల కన్నా తక్కువ 44 ఏళ్ల కన్నా ఎక్కువ ఉండకూడదు. రిజర్వుడు కేటగిరీ అభ్యర్థుల గరిష్ట వయసు 49 ఏళ్లు కాగా, వికలాంగులకు మాత్రం గరిష్ట వయసు 54 ఏళ్ల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎక్స్ సర్వీస్‌మెన్‌కు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

జిల్లాలో పోస్టుల వారీగా ఖాళీలు

విభాగం	పోస్టుల సంఖ్య
స్కూల్ అసిస్టెంట్ భాష-1	37
స్కూల్ అసిస్టెంట్ హిందీ	11
స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్	65
స్కూల్ అసిస్టెంట్ గణితం	33
స్కూల్ అసిస్టెంట్ పిఎస్	14
స్కూల్ అసిస్టెంట్ ఎన్ఎస్	34
స్కూల్ అసిస్టెంట్ సోషల్	70
స్కూల్ అసిస్టెంట్ పిఇటి	81
ఎస్‌జిటి	118
మొత్తం	**458**

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పోస్టుల వివరాలు

ఇంగ్లీష్	12
గణితం	13
పిఎస్	10
ఎన్ఎస్	12
సోషల్	5
ఎస్‌జిటి	33
మొత్తం	85

మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

మోడల్ ఇచ్ఛాపురంగా తీర్చిదిద్దుతా

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని మోడల్‌గా అభివృద్ధి చేసే భాధ్యత నాదని, మున్సిపాలిటీ ఏర్పాటై 40 ఏళ్లు అవుతున్నా అభివృద్ధి శూన్యమని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. స్థానిక ఆర్‌జె ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన వివిధశాఖ అధికారులతో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఉద్దానం ప్రాజెక్టు ద్వారా మున్సిపాల్టీకి నీరందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి ముఖద్వారంగా ఉన్న ఇచ్ఛాపురం రూపురేఖలు మారుస్తానని హామీనిచ్చారు. మున్సిపాల్టీలో 23 వార్డు ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం రూ.700 కోట్లు ఖర్చు చేసి నియోజకవర్గంలో ఎన్ని గ్రామాలకు తాగునీరు అందించారని అధికారులను ప్రశ్నించారు. నియోజకవర్గంలో 375 గ్రామాలకు గాను పది గ్రామాలకు మాత్రమే కుళాయిల ద్వారా తాగునీరు అందుతుందని అధికారులు వివరించారు. దీనిపై కేంద్రమంత్రి మాట్లాడుతూ రూ.700 కోట్లు ఖర్చు చేసిన గత ప్రభుత్వం నిధులన్నీ నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సాగునీటిపై ప్రత్యేక దృష్టిసారించి ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలని ఆదేశించారు. రైతులు కూడా గ్రామసభలు ఏర్పాటు చేసుకొని ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జనసేన నియోజకర్గ సమన్వయకర్త దాసరి రాజు పాల్గొన్నారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మాజీ ఎంపిపి ఢిల్లీరావు, వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జనసేన నాయకులు వినతిపత్రాలను అందజేశారు.

మెమో 57ను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నంబరు 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని మెమో 57 సాధన సమితి జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మెమో 57 సాధన సమితి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మెమో 57ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2004 జనవరి ఒకటో తేదీకి ముందు నోటిఫికేషన్ ఇచ్చి పాలనాపరమైన సాంకేతిక కారణాలతో నియామకాలు ఆలస్యమైన కారణంగా ఉద్యోగాల్లో చేరడం ఆలస్యమైందని గుర్తు చేశారు. ఆలస్యంగా విధుల్లో చేరినా పిఎఫ్ఆర్‌డిఎ చట్టం అమలుకు ముందే నోటిఫికేషన్ వచ్చినందున వీరంతా పాత పెన్షన్ పొందడానికి అర్హత కలిగి ఉన్నారని తెలిపారు. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా నియమితులైన 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటం తప్పదని హెచ్చరించారు. ఇదే డిమాండ్‌తో మేలో విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఆమరణ నిరాహారదీక్ష చేస్తామన్నారు. సమావేశంలో సాధన సమితి జిల్లా కో-కన్వీనర్లు బలగ శ్రీను, కె.ప్రకాష్, అంబటి లక్ష్మణరావు, గురుగుబెల్లి చిన్నికృష్ణ, శివరాం ప్రసాద్, గురుగుబెల్లి భాస్కరరావు, వాసుదేవరావు, బాడాన బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సూదికొండను బోడికొండ చేశారు

- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు
- కంకర తవ్వకాలు పరిశీలన

పోలీసులతో వాగ్వాదం చేస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

సూదికొండలో టిడిపి నాయకుల ఆక్రమణలు, కంకర తవ్వకాలతో బోడికొండగా మార్చారని మాజీ మంత్రి, వైసిపి నాయకులు సీదిరి అప్పలరాజు విమర్శించారు. పలాసలోని సూదికొండలో ఆక్రమణలు, కంకర తవ్వకాలపై వైసిపి, టిడిపి నాయకులు వారం రోజులుగా తహశీల్దార్‌కు ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో మాజీ మంత్రి అప్పలరాజు తన అనుచరులతో ఆదివారం సూదికొండ పరిశీలనకు వెళ్లేందుకు సిద్ధం కాగా, పోలీసులు ఆయన్ను అడ్డుకున్నారు. దీంతో ఆయనకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం అప్పలరాజును విడిచిపెట్టడంతో సూదికొండలో కంకర తవ్వకాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. సూదికొండలో కంకర తవ్వకాలపై ప్రశ్నిస్తే కేంద్రీయ విద్యాలయం కోసం అంటున్నారని, మంజూరు కాని కేంద్రీయ విద్యాలయానికి కంకర తవ్వకాలు ఏమిటని ప్రశ్నించారు. టిడిపి నాయకులు కంకర అమ్ముకొని కమీషన్లు తీసుకోవడానికే అనుమతులు ఇచ్చి సూదికొండను బోడికొండగా మార్చారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇక్కడ తవ్వకాలు చేస్తుంటే ఆపామని, ఆ వ్యక్తి టిడిపిలో చేరి ఇప్పుడు తమపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలను మభ్యపెట్టి 51 సర్వే నంబరులోని రెండెకరాల్లోని పేదల ఇళ్ల పునాదులను బుల్డోజర్లతో తొలగించి వారిని నడిరోడ్డు మీదకు ఈడ్చారన్నారు. అదే సర్వే నంబరులో టిడిపి నాయకుడు 2017లో నాలుగు ఎకరాలు అక్రమించి పక్క సర్వే నంబర్లతో పేదలకు విక్రయించి రిజిస్ట్రేషన్లు చేశారని చెప్పారు. వైసిపి నాయకుడు శిష్టు గోపి ఇద్దరు వ్యాపారుల నుంచి ఇక్కడ 40 సెంట్లు కొనుగోలు చేసి పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే దాన్ని తొలగించారని చెప్పారు. సూదికొండ అక్రమాలపై చర్చకు రావాలని టిడిపి నాయకులకు పిలుపునిచ్చినా రాలేదని, మీరు ఎప్పుడు వస్తారో చెప్తే అప్పుడు వచ్చి దొంగ ఎవరు, దొర ఎవరన్నది తేల్చుకుంటామన్నారు. 51 సర్వే నంబరు పక్కన టిడిపి నాయకుడు లొడగల కామేష్ అక్రమించుకున్న మూడెకరాల స్థలం జోలికి అధికారులు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. టిడిపి నాయకులు చెరువులు, కాలువలు, డి-పట్టా భూములు ఆక్రమించుకొని విక్రయాలు చేస్తున్నా వారిపై చర్యలు లేవన్నారు. పలాసలో ఆక్రమణలు, అరాచకాలపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేస్తామని, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూస్తామన్నారు. టిడిపి నాయకుల వద్ద కొనుగోలు చేసిన పేదలు నష్టపోయారని వారికి నష్టపరిహారం గానీ, ఇళ్ల స్థలాలు గానీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో తనపై కొండలరాజా అని ఆరోపణలు చేశారని, నేడు అక్రమ కంకర రవాణాలు చేస్తున్న వారికి ఏం పేరు పెట్టాలన్నారు. ఈ అక్రమ వ్యవహారంలో తహశీల్దార్ కూడా సూత్రధారి అని ఆరోపించారు. ఎవరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తండ్యాం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

తండ్యాంలో రైతులతో మాట్లాడుతున్న మోహనరావు

పొందూరు: మండలంలోని తండ్యాం ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.అజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తండ్యాంలో రైతుసంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో లైదాం సమీపంలోని రెల్లిగడ్డ వద్ద తండ్యాం ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసినా, నేటికీ పనులు పూర్తి కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఎత్తిపోతల పథకం వల్ల తండ్యాం, కృష్ణాపురం, మలకాం, బాణాం, పొందూరు పంచాయతీల పరిధిలోని 15 గ్రామాల్లో సుమారు ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని చెప్పారు. ఈ గ్రామాలకు ఏ విధమైన సాగునీటి కాలువల్లేని మెట్ట ప్రాంతం, వర్షంపై ఆధారపడి రైతులు పంటలు పండిస్తున్నారని తెలిపారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి 300 అడుగుల బోర్లు వేయాల్సి వస్తోందన్నారు. అయినా వేసవికాలంలో బోర్లు ఎండిపోయి నీరందక రైతులు వేసిన పంటలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి గ్రామాలకు ఎత్తిపోతల పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాంటి ప్రాజెక్టుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల నిత్యం ఈ ప్రాంతం కరువుకి గురవుతోందని చెప్పారు. తండ్యాం ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసి ఐదేళ్లయిందని గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వం పనులు ప్రారంభించినా, తర్వాత వచ్చిన ప్రభుత్వం ఈ ప్రాజెక్టుని పూర్తిగా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఈ ఎత్తిపోతల పథకం కోసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికీ 50 శాతం పనులు కూడా పూర్తి కాని ఈ ప్రాజెక్టు పైపులు, కట్టడాలు నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి అసంపూర్తిగా ఆగిపోయిన ఈ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.రాములు, కె.సూర్యారావు, ఎం.అప్పలరాజు, కె.అప్పారావు పాల్గొన్నారు.

ముగిసిన బారువ బీచ్ ఫెస్టివల్

ప్రధాన ఆకర్షణగా పారామోటార్ ఫ్లయింగ్, స్కూబా డైవింగ్

సోంపేట : తూర్పు తీరంలో పర్యావరణ పరిరక్షణకు ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తున్న ఆలివ్ రిడ్లే తాబేలు బీచ్ ఫెస్టివల్ బారువా తీరంలో ఆదివారంతో ముగిసింది. రెండో రోజు ప్రధాన ఆకర్షణగా స్కూబా డైవింగ్ నిలిచింది. ఈనెల 19న ప్రారంభమైన ఈ వేడుక విద్యార్థులు, స్థానికుల భాగస్వామ్యంతో తాబేళ్ల సంరక్షణ ప్రాముఖ్యతను చాటిచెప్తోంది. తాబేళ్ల సంరక్షణకు తమవంతు సహకారం అందించాలని జిల్లా అటవీ అధికారి ఎస్.వెంకటేష్ కోరారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ట్రీ ఫౌండేషన్ భాగస్వామ్యంతో చేపట్టిన తాబేలు గుడ్ల సంరక్షణకు జిల్లాలో 13 సంరక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలివ్ రిడ్లే తాబేలు ఒడ్డుకు వచ్చి ఇసుకల్లో సుమారు 80 నుంచి 120 గుడ్ల వరకు పెట్టి వాటిని ఇసుకతో కప్పిపెట్టి మళ్లీ సముద్రంలోకి వెళ్లిపోతాయన్నారు. ప్రతిరోజు ఉదయం తీరంలో వాలంటీర్స్ వాటి అడుగుజాడలను బట్టి గుడ్లు పెట్టిన ప్రదేశాన్ని గుర్తించి వాటిని సేకరించి సంరక్షణ కేంద్రాల్లో భద్రపరుస్తారని తెలిపారు. ఇవి సుమారు 45 నుంచి 50 రోజుల సమయంలో పిల్లలుగా మారుతాయన్నారు.

బారువ తీర ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న బీచ్ ఫెస్టివల్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది. రెండో రోజు ఆదివారం ఉదయం నుంచి పర్యాటకులు తీరాన్ని సందర్శించారు. మాజీ సైనికోద్యోగులు నిర్వహిస్తున్న లైవ్ ఇన్ అడ్వెంచర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూబా డైవింగ్ విశేషంగా ఆకట్టుకుంది. బారువ తీరంలో గతంలో మునిగిపోయిన ఓడ వద్దకు బోటుపై సందర్శకులను తీసుకువెళ్లడం, అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలకు సంబంధించి ఫ్లెక్సీని ప్రదర్శించారు. విహంగ అడ్వెంచర్స్ అనే సంస్థ ఆధ్వర్యాన పారా మోటర్ ఫ్లయింగ్ నిర్వహించారు. ఒకసారి ఒక పైలట్, ఒక టూరిస్ట్‌తో గాలిలో విహరిస్తుంది. ఇందుకు ఒక వ్యక్తికి రూ.రెండు వేలు టిక్కెట్ వసూలు చేశారు.

హ్యాచరీల సందర్శనకు ఆహ్వానం

జిల్లాలో గుర్తించిన 13 తాబేలు హ్యాచరీల్లో మే 20 వరకు ప్రతిరోజూ ఉదయం 5.15 నుంచి ఆరు గంటల మధ్య తాబేలు పిల్లలను సముద్రంలోకి విడుదల చేసే కార్యక్రమాలు జరుగుతాయి. బుడగట్లపాలెం నుంచి దిబ్బలపాలెం వరకు వరకు ఉన్న ఈ హ్యాచరీల వివరాలను ఫారెస్ట్ శాఖ తెలియజేసింది. ప్రజలు తమ సమీపంలోని హ్యాచరీలను సందర్శించి, వీటిని తిలకించవచ్చు.

మాస్టర్‌ప్లాన్ అమలుతో కొత్త శోభ

- అరసవల్లి ఇంద్రపుష్కరణి పనులకు రీ టెండరు
- పటిష్టంగా నిత్యాన్నదాన పథకం
- యాత్రికులకు అసౌకర్యం లేకుండా చర్యలు
- ఆలయ వార్షికాదాయం పెంపునకు ప్రణాళికలు
- అరసవల్లి ఆలయ ఇఒ వై.భద్రాజీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికులు వస్తుంటారు. వారికి అవసరమైన మౌలిక వసతులను సమకూర్చేందుకు వీలుగా మాస్టరు ప్లాన్‌ను అమలు చేసేందుకు ప్రభుత్వం దపదఫాలుగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు మొదలు పెట్టామని ఆలయ ఇఒ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ వై.భద్రాజీ తెలిపారు. ఇప్పటి వరకు అరసవల్లి అభివృద్ధిలో భాగంగా రెండు సార్లు మాస్టరు ప్లాన్‌ను రూపొందించామన్నారు. దేవాదాయశాఖ నింబంధనలకు లోబడి మార్పులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. ఆలయానికి ఏటా రూ.12 కోట్లకు మించి వార్షిక ఆదాయం సమకూరుతుందన్నారు. ఆలయంలో మరిన్ని మౌలిక వసతులు సమకూర్చు కునేందుకు వీలుందన్నారు. గతంలో ఆలయానికి ఎదురుగా ఉన్న ఇంద్రపుష్కరణి పునర్నిర్మాణానికి రూ.4 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినా... టెండర్లు ప్రక్రియ, ఇతర కారణాల వల్ల పనులు మొదలు కాలేదన్నారు. గత టెండర్లు రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవడానికి ప్రభుత్వం యోచిస్తోందని వివరించారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? సమస్యను ఎలా అధిగమిస్తారు?

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి పెద్దమొత్తంలో ఆదాయ వనరులు ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు మధ్యస్థంగా ఉండడం వల్ల అరసవల్లి ఆలయానికి దేశంలోని అనేక ప్రాంతాల నుంచి యాత్రికులు వస్తుంటారు. వారికి అవసరమైన మౌలిక వసతులు దేవాదాయ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సమకూర్చేందుకు చర్యలు చేపట్టింది. ధార్మిక సంస్థల్లో మార్పులు చేయడానికి స్తపతి, ఇంజినీరింగ్ నిపుణుల సహకారం తప్పని సరి. వారిచ్చే మాస్టరు ప్లాన్‌కు అనుగుణంగానే ఆలయ పరిసరాలను మార్పులు చేయాల్సి ఉంటుంది. వ్యయప్రయాసలతో పాటు ఆలయ విశిష్టతను భంగపరచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దీనికి తోడు ఆలయం చుట్టూ పూర్వం నుంచి అనేక కుటుంబాలు స్థిర నివాసం ఏర్పరచుకుని జీవనాన్నిసాగిస్తున్నారు. మాస్టరు ప్లాన్ పేరుతో ఏఒక్కటి మార్చాలన్నా ఈ నిబంధనలకు లోబడి మాత్రమే చేయాలి. ఆలయానికి ముందు ఉన్న వీధులు, ఇతర ఆలయాలు మాదిరిగా విశాలంగా ఉండేలా ఇటీవల మార్పులు చేపట్టాం. దీనివల్ల అక్కడున్న కట్టడాలు తొలగించాల్సి వచ్చింది. వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఒక్కొక్కటిగా సమకూర్చు కుంటున్నాం. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈ ఏర్పాట్లు చేస్తున్నాం.

? ఎంతమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు?

అరసవల్లి దేవస్థానం నిర్వహణ అవసరాలకు కార్యనిర్వహణాధికారితో పాటు ఇద్దరు సూపరింటెండెంట్లు, ఇద్దరు సీనియర్, ముగ్గురు జూనియర్ సహాయకులు ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు, ఎలక్ట్రీషియన్, నలుగురు అటెండర్లు, నలుగురు స్వీపర్లు మంజూరై ఉన్నాయి. వీరితో పాటు ఐదుగురు అర్చకులు, పరిచారిక, పచిక, ఒక్కొరు, నలుగురు వేదపారాయణదారు, కుక్, ఐదుగురు భజంత్రీలు, సబ్ టెంపుల్‌కు, అవుట్ సోర్సింగ్, నైట్ వాచ్‌మెన్ కలుపుకుని మరో 29 పోస్టులు మంజూరై ఉన్నాయి. వీటిలో అర్చకులు, మినహా మిగిలిన పోస్టుల్లో ఎక్కువ శాతం ఖాళీగా ఉన్నాయి. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 49 మంది విధుల్లో ఉన్నారు. వారి నియామకాల్లో సాంకేతిక అనుమతిలేని కారణంగా కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని ఉన్నతాధికారులతో చర్చించి ఒక్కొటిగా పరిష్కరించుకుని నిర్వహణకు ఆటంకం లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తున్నాం.

? ఇంద్రపుష్కరణి మరమ్మతు పనులు ఏ దశలో ఉన్నాయి?

ఆలయానికి ఎదురుగా విశాలమైన ఇంద్రపుష్కరణి ఉంది. స్వామివారికి చిలుకుల ద్వాదశి పర్వదినాన తెప్పోత్సవాన్ని ఇక్కడే కన్నుల పండవగా నిర్వహిస్తుంటాం. ఈ పుష్కరణి ప్రస్తుతం పునర్నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం అనుమతించింది. దేవాదాయశాఖ నుంచి రూ.4 కోట్ల నిధులతో పునర్నిర్మాణం చేపట్టాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో టెండర్లు పూర్తయ్యాయి. పనులు ప్రారంభించడంలో జాప్యం కారణంగా వాటిని నిలిపివేశారు. టెండరును రద్దు చేసి రీ టెండరుకు వెళ్లాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. మాస్టరు ప్లాన్‌లో ఈ పనులూ ఉన్నాయి.

? ఇతర కట్టడాలకు ప్రతిపాదనలు ఉన్నాయా?

ఆలయానికి ఎదురుగా భవనాలను రథసప్తమి సమాయాన తొలగించాం. ఆలయం మూఢ వీధులకు, ఆలయ ప్రధాన ద్వారానికి మధ్యలో రోడ్డు ఉండడం వల్ల కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి. దీనికి ప్రత్నాయం అవసరమని అధికారులు, పాలకులు గుర్తించారు. ప్రస్తుతం పుష్కరణికి దక్షిణ బాగాన వివిధ కట్టడాలు చేపట్టాల్సి ఉంది. పుష్కరణి, టిక్కెట్ల కౌంటర్లు, ప్రసాదం తయారీ కేంద్రం, ప్రసాదం విక్రయశాల, నిత్యాన్నదాన సత్రం, కేశఖండన శాలలను పనర్నిరించుకోవాల్సి ఉంది. అలాగే పరిపాలనా భవన నిర్మాణంతో పాటు డార్మెటరీ, కళ్యాణ మండలంతో పాటు క్యూలైన్ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రసాదం పథకం ద్వారా రూ.100 కోట్ల అభివృద్ధికి ఆమోదం తెలిపింది. కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు ప్రత్యేక శ్రద్ధతో ఈ నిధులు మంజూరుకు కృషి చేశారు.

రైతుల నడ్డి విరిచిన ప్రభుత్వం

శ్రీనివాస్, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

కూటమి ప్రభుత్వం రైతులకు నడ్డి విరిచిందని వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలో సన్నరకం ధాన్యం కొనుగోలు లేక రైతులు అవస్థలు పడుతున్నారని అన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాటలతో రైతులు సన్న రకాలు సాగు చేశారని, వాటికి గిట్టుబాటు ధర లభించడం లేదని మండిపడ్డారు. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 8 లక్షల టన్నుల ధాన్యం పండిస్తే... 5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని, మిగతా ధాన్యం రైతుల దగ్గరే ఉన్నాయని అన్నారు. రబీ పంటకు సుక్క నీరు కూడా అందించలేదని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ఎందుకు ఆగిందని పరిశీలించగా, ఎఫ్‌సిఐ షిప్పు సీజ్ చేశారని, అందుకే కొనుగోలు నిలిపివేయాయని తెలిపిందని అన్నారు. ఈ విషయం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు తెలియకపోవడం బాధాకరమన్నారు. రెండు బడ్జెట్లలో సూపర్ సిక్స్ పథకాలకు ఒక రూపాయి కూడా కేటాయించలేదని అన్నారు. జగనన్న ప్రభుత్వంలో సన్న రకాలకు మంచి గిరాకీ ఉండేదని, రైతు ఏ రోజు దిగులుపడలేదు అన్నారు.



నివేదిక అందిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

వృత్తి విద్యా బోధకులకు తీపికబురు

కవిటి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వృత్తి విద్యా బోధకులకు పాత పింఛను విధానం అమలు చేసే దానికి రావలసిన బెనిఫిట్స్ అందించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందించిన వినతిపై సానుకూలంగా స్పందించినట్లు వృత్తి విద్యా బోధకుల జిల్లా అధ్యక్షుడు బల్లెడ శంకరరావు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య వృత్తి విద్య బోధకులకు సంబంధించిన 8 పేజీల నివేదిక తయారు చేశారు. దీనిని విద్యాశాఖ మంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారం పై ఇదివరకే హైకోర్టులో సానుకూల స్పందన వచ్చిందని, ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వృత్తి విద్యాబోధకుల సమస్యలు పరిష్కారమవుతాయని శంకరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు బూర్జలో పల్లెనిద్ర

బూర్జ: మండల కేంద్రంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొననున్నారు. అయితే ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మండలంలోని ప్రధాన సమస్యలు ఆయనకి స్వాగతం పలకనున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన ఆస్పత్రి భవనం దశాబ్దం అప్పగించక పోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. అలాగే చిన కలిగిలో తాగునీరుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ముఖ్యంగా రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల సైడ్ కాలువలు నిర్మించకపోవడం వల్ల సామాజిక భవనం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. అలాగే వర్షాకాలంలో మండల కేంద్రంలోని కొమటిపేట, గంగుపేట, దేవరపేట నాగావళి నది పక్కన ఉండడం వల్ల నదికి రక్షణగోడ లేకపోవడంతో ముంపు భయం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

లావేరు: లావేరు మండల తహశీల్దార్‌గా ఎం.రాజేశ్వర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన ఎన్ని జోగారావు శ్రీకాకుళం కలెక్టరేట్‌కు బదిలీ కాగా రాజేశ్వర్ విజయనగరం జిల్లా రాజాం మండలం నుంచి తహశీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి దిశగా నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకారాన్ని అందించాలని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌కు డిటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, ఆర్ఎస్ డిటి ఎం.తిరుపతిరావు, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, సీనియర్ అసిస్టెంట్ రత్నాకర్, కార్యాలయ సిబ్బంది కీర్తి వెంకటరమణ, కెవి భాస్కరరావు, సూర్యనారాయణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పెంటవూరులో శ్రమదానం

నందిగాం : మన గ్రామం మానస సమాధానం పేరిట నందిగామ పంచాయతీ పెంటవూరులో అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యాన యువజన సంఘ సభ్యులు ఆదివారం వీధులను పరిశుభ్రం చేశారు. చెత్తను తొలగించే వీధులను శుభ్రపరిచే ప్రజారోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సేవా సంఘం సభ్యులు బి.ధర్మారావు కార్యదర్శి పి.నరసింహమూర్తి, కోదండరాం, బాబూరావు, లోహిత్‌కుమార్, పద్మలోచన పాల్గొన్నారు.

వేడుకగా ఎల్లమ్మ మండపం ప్రతిష్ట

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగకు చెందిన పుటియాదళ పొలాల్లో ఉన్న ఎల్లమ్మ తల్లి నూతన మండపం ప్రతిష్ట ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఎల్లమ్మను దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తీరంలో నిశ్శబ్దం

చేపల వేట నిషేధంతో తీరం ఐదు రోజులుగా నిశ్శబ్దంగా ఉంది. వలలు అలలకు ఇవతల వైపు ఉండే సమయం.. మర బోట్లు నిశ్శబ్దంగా తీరంలో నిలబడే కాలం. చేపలు గుడ్లు పెట్టి, అవి పిల్లలుగా మారే కీలక రోజులివి. రెండు నెలల పాటు జరిగే ఈ అపురూప ప్రక్రియకు ఆటంకం కలగకుండా మత్స్యకారులు మర బోట్లను ఆపేస్తారు. 61 రోజుల పాటు వేటకు విరామం ప్రకటిస్తారు. ఈ నెల 15 అర్ధరాత్రి నుంచి ఈ విరామం మొదలైంది. కాగా... అధికారులు ఇప్పటికే మత్స్యకార గ్రామాల్లో దీనిపై అవగాహన కల్పిస్తున్నారు.

- ఇళ్లకే పరిమితమైన గంగపుత్రులు
- జూన్ 16 వరకు వేట నిషేధం

లంగరు వేసిన బోట్లు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మత్స్య సంపద పెంపొందించేందుకు వీలుగా నిషేధం విధించారు. ఈనెల 15 అర్ధరాత్రి నుంచి జూన్ 16 వరకు నిషేధం అమల్లో ఉంటుంది. ఈ కాలంలో చేపలు సంతాన ఉత్పత్తి వృద్ధి చెందేందుకు వీలుగా ఈ నిషేధం అమల్లో ఉంటుంది. జిల్లాలో ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం 11 మండలాల్లో 104 గ్రామాల పరిధిలో 193 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. సుమారు 60 వేల మంది సముద్ర వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. 61 రోజుల పాటు వీరి ఉపాధి కోసం కూటమి ప్రభుత్వం రూ.10 వేలు ఉన్న మత్స్యకార భృతిని రూ.20 వేలకు పెంచడంతో మత్స్యకార కుటుంబాలకు ఆర్థికభరోసా ఇచ్చినట్లయ్యింది. ఈ నెల 26న పెంచిన భృతిని కూటమి ప్రభుత్వం అందజేయనుంది. అయితే రేషన్‌కార్డు ప్రాతిపదికన కాకుండా ఇంట్లో ఎంతమంది చేపల వేటకు వెళ్తే అంత మందికీ పెంచిన భృతిని అందజేస్తే మత్స్యకార కుటుంబాలకు మరింత ఊతంగా నిలుస్తుందని వారంతా కోరుతున్నారు. మత్స్యకారులకు ఉపాధి కల్పించే మంచినీళ్లపేట జెట్టి, బుడగటపాలెం హార్బర్ ఏళ్ల తరబడి హామీలు దశ దాటి అమలుకు నోచుకోకపోవడంతో ఈ ప్రాంతం నుంచి వివిధ రాష్ట్రాలకు వలసపోతున్నారు. వీరవల్, గోవా, కాండ్ల, మంగుళూరు, ముంబై వంటి ప్రాంతాలకు డ్రైవర్లగాను, కలాసీలుగాను, వంటపని వాళ్లు గానూ వలస వెళ్లిపోతున్నారు. సంప్రదాయ పడవలు, తెడ్డు, తెరచాప పడవలు (ఇంజిన్ లేని) వారికి వేట నిషేధం నుంచి మినహాయింపు ఉంటుందని మత్స్యశాఖ ఉప సంచాలకులు వై.సత్యన్నారాయణ అన్నారు. ప్రధానంగా వివిధ చేపలు, రొయ్యల జాతులు సంతా నోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగదలను ప్రోత్సహించడం ద్వారా సముద్ర మత్స్య సంపదను కాపాడటమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వేట నిషేధ సమయంలో చట్టాన్ని అతిక్రమించే వారు శిక్షార్హులని, వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే ఇతర సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తామని తెలిపారు. జరిమానా విధింపుతోపాటు డీజిల్‌పై రాయితీ తొలగిస్తామన్నారు.

వేట నిషేధ కాలాన్ని కచ్చితంగా అమలు చేయడానికి మత్స్యశాఖ, కోస్టుగార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ అధికారులతో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. మత్స్యకారులందరూ సహకరించాలని కోరారు.

వలస వెళ్తున్నాం

61 రోజులు పాటు చేపల వేట లేకపోవడంతో ఎటువంటి ఆధారం లేదు. కూలి పనులు నిమిత్తం విశాఖపట్నం, చెన్నై వెళ్లి వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణ చేసుకుంటాం. మత్స్యకార భృతి పెంచుతూ... జిల్లాలో ఉపాధి కల్పించాలి.

- సూరాడ కొర్లయ్య, డి.మరువాడ

వలలు మరమ్మతులు చేసుకుంటున్నాం

61 రోజులు పాటు చేపల వేట లేకపోవడంతో వలలు, బోట్లు మరమ్మతులు చేసు కుంటున్నాం. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందించిన రూ.20 వేలతో కుటుంబం గడవడం చాలా కష్టంగా ఉంటుంది. ప్రభుత్వం స్పందించి భృతి పెంచాలి.

- సూరాడ అప్పలస్వామి, డి.మరువాడ

అందరికీ భృతి అందజేయాలి

సాధారణంగా వేట చేయాలంటే ఇంజిన్ బోటుపై 8 నుంచి పది మంది, సంప్రదాయ తెప్పలపైన నలుగురు నుంచి ఐదుగురు వేటకు వెళ్తుంటాం. కానీ, ప్రభుత్వం ఇంజిన్ బోటుపైన వేట చేసిన వారికి ఆరుగురికి, సాంప్రదాయ తెప్పలపై వేట చేసిన వారికి కేవలం ముగ్గురికి మాత్రమే మత్స్యకార భృతి అందిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి అందరికీ మత్స్యకార భృతి అందించాలి.

- శ్రీరంగం వీరాస్వామి, గెద్దలపాడు

రూ.40 వేలు భృతి అందించాలి

గతేడాది, ఈ ఏడాది కలిసి మొత్తం రూ.40 వేలు మత్స్యకార భృతి కల్పించాలి. ప్రభుత్వం ఒక్క ఈ ఏడాది రూ.20 వేలు ఇస్తామని ప్రకటిం చడం బాధాకరం. గతేడాది మత్స్యకార భృతి రాకపోవడంతో ఆర్థికంగా నష్ట పోయాం. 90 శాతం సబ్సిడీపై వలలు, బోటులు అందించాలి. వేటకు వెళ్లి మృతి చెందిన మత్స్యకార కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

- చింతల రాజులు, గెద్దలపాడు

పాలనాదక్షుడు చంద్రబాబు

శ్రీకాకుళం : కేకు కట్ చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సిఎం చంద్రబాబు పరిపాలనాదక్షుడని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కొనియాడారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న టిడిపి జిల్లా కార్యాలయంలో చంద్రబాబు 75వ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కేకు కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న తెలుగువారి ఖ్యాతిని ఖండాంతరాల్లో చాటి చెప్పారన్నారు. అనంతరం ఏడురోడ్ల జంక్షన్ వద్ద స్వర్గీయ ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. యువత రక్త దానం చేశారు. అలాగే పేదలకు కొత్తబట్టలను పంచిపెట్టి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, కార్యదర్శి చిట్టి నాగభూషణం, తెలుగు యువత నాయకులు మెండ దాసునాయుడు, కొర్ను ప్రతాప్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు పాల్గొన్నారు.

లావేరు: సిఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు మండల వ్యాప్తంగా నిర్వహించారు. కేకు కట్ చేసి, సీట్లు, పళ్లు పంపిణీ చేశారు. తాళ్ళవలసలో టిడిపి మహిళా రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. రావివలసలో టిడిపి నాయకులు దారపురెడ్డి కుర్మారావు, బుడుమూరులో పండి గోపాలరావు, నెల్లి లక్ష్మీనాయుడు, బెజ్జిపురంలో మాజీ సర్పంచ్ ఇజ్జాడ శ్రీనువాసరావు ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. కార్యక్రమంలో మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణ శివారున ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహ ఆవరణలో సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, బోర గోవిందరావు, కూన వెంకట సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, విద్యాసాగర్ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి చంద్రబాబు నాయుడు పేరుతో భారీ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళీ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నడుకుడిటిపాలెం ఆయన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. 75 కేజీల కేకును కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు చౌదరి బాబ్జి, నియోజకవర్గం కూటమి నాయకులు లెంక శ్యాం, ముప్పిడి సురేష్, గొర్లె లక్ష్మణరావు, డిజిఎం ఆనందరావు, పిసిని జగన్నాధం నాయుడు, విశ్వక్షేన్, తోటయ్యదొర పాల్గొన్నారు.

కవిటి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత కలిగిన నాయకుడని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అశోక్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నరసన్నపేట : సిఎం చంద్రబాబు పిట్టిన రోజు సందర్భంగా గొట్టిపల్లి వృద్ధాశ్రమం అనాథలకు ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని సిఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా మాజీ ఎంపిపి సలాన మోహనరావు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ మాజీ ఎంపిపి భైరసింగి లక్ష్మీనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి, బూరెల లలిత శ్రీనివాస్, సర్పంచ్‌లు రవ్వల గణపతిరావు, ప్రసాదరావు, కదంబల పైడిరాజు, వెంకటరావు, మాధవరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కవిటి : కేక్ కట్ చేస్తున్న విప్ అశోక్

కోటబొమ్మాళి: స్థానిక ఎన్‌టిఆర్ భవనంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్ అధ్యక్షతన సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, కర్రి అప్పారావు, పూజారి శైలజ, బెండి అన్నపూర్ణ, హనుమంతు అప్పలరాజు, నంబాళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక గ్రంథాలయంలో సిఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా గ్రంథాలయాధికారి టి.ఇందిరా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి శ్రీరాములు, సిబ్బంది డి.లక్ష్మి పాల్గొన్నారు.

నందిగాం : టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్‌కుమార్ అధ్యక్షతన సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎం.బాలకృష్ణ, ఎం.ప్రసాదరావు, కె.విశ్వనాథం, ఎస్.జానకిరామ్ పాల్గొన్నారు.

జీవామృతంపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని మహాసింగిగూడలో ఎటిఎం మోడల్ ఎల్ఎంటి సూర్యనారాయణ ఆధ్వర్యాన ఆదివారం క్వాలిటీ ద్రవజీవామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ క్వాలిటీ ద్రవజీవామృతం తయారీకి కావాల్సిన పదర్థాలు, ఎన్ని రోజులకు తయారీ అవుతుంది, దీనివల్ల భూమికి కలిగే ఉపయోగాలు గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి చిన్నమ్మి, ఐసిఆర్‌పి ముఖలింగం పాల్గొన్నారు.

బోడికొండ చేసింది అప్పలరాజే

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పలాస: సూదికొండను బోడికొండ చేసిందే మాజీ మంత్రి అప్పలరాజు, ఆయన అనుచరులేనని, ఇప్పుడు ఛలో సూదికొండ కార్యక్రమాన్ని వైసిపి నాయకులు నిర్వహించడం దొంగే దొంగ అన్న చందంగా ఉందని టిడిపి నాయకులు వ్యాఖ్యానించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాట్లాడారు. వైసిపి పాలనలో కంకరను తవ్వి బోడికొండను చేసిందని అన్నారు. పులిరాజు, కొండే మల్లేసులు ఏ పార్టీకి చెందినవారని మంత్రిని ప్రశ్నించారు. ఇందులో వీరితో పాటు మొత్తం కొండచుట్టు అక్రమంగా దొంగ సంతకాలు చేసుకొని పట్టాలు పొందిన చరిత్ర వైసిపి నాయకులకు ఉందన్నారు. కేంద్రమంత్రి, కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి పదెకరాల స్థలం అవసరం ఉండడంతో దీన్ని సేకరించేందుకు ఆక్రమణల చెరలో ఉన్న భూములకు విముక్తి కలిగించామని అన్నారు. వైసిపి నాయకుల భూములు కూడా ఇందులో ఉన్న అక్కసుతోనే మంత్రి ఇటువంటి మతిలేని వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఎపిటిపిసి చైర్మన్ వజ బాబూరావు, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, కొండే నర్సింహులు, గురిటి సూర్యనారాయణ, పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, ఎం.నరేంద్ర (చిన్ని), జోగ మల్లి, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, గురువులను మర్చిపోవద్దు

శ్రీనివాసరావు దంపతులకు సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - పలాస

కన్న తల్లిదండ్రులను, పుట్టిన ఊరు, విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలను మర్చిపోవద్దని విశ్రాంత ఉపాధ్యాయులు అన్నారు. పలాస మండలం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో 1997-98 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న జాతీయ నాయకులకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం మృతి చెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల చిత్రపటాలకు పూలమాలలు వేసిని నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు తమ పిల్లలను పెద్దలను గౌరవించే విధంగా పెంచాలన్నారు. మంచి సమాజాన్ని నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పిల్లలకు మంచి విద్యాబుద్ధిలు నేర్పించాలని సూచించారు. చదువుతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుతుందని చెప్పారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కణితి సూర్యనారాయణ, గరుగు సింహాచలం, ఉపాధ్యాయులు పొట్నూరు మురళీకృష్ణ, బమ్మిడి కుసురాజు, ప్రసాదరావు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

రణస్థలం : పరికరాలు చూపిస్తున్న ఫైర్ సిబ్బంది

రణస్థలం: రణస్థలం ఫైర్ స్టేషన్‌లో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ముగింపు సభలో ఫైర్ అధికారి పైల అశోక్ మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా వారం రోజులు అవగాహన సదస్సులు, మాక్ డ్రిల్, ఫైర్ సిబ్బంది చేసిన ఫైర్ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : అగ్నిమాపకశాఖ కార్యాలయలో ఆదివారంతో అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సభ నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ప్రశాంత్‌కుమార్, సూర్యారావు, సిబ్బంది కామరాజు, నీలాచం, ఎన్.ప్రసాద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ఎన్.బుచ్చోదు, డ్వాక్రా సంఘ మహిళలు, ఎన్‌జిఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా తరలిపోతున్న ఎర్రమట్టి

- నిర్లక్ష్య ధోరణిలో అధికారులు
- చెలరేగుతున్న మట్టి మాఫియా

ప్రజాశక్తి - బూర్జ

యధేచ్ఛగా ఎర్రమట్టి తరలిపోతుంది. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుండడంతో మట్టి మాఫియాకు ఎదురు లేకుండా పోయిందని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పొలాల్లోని కాలువలను నదీతీర ప్రాంతాల్లో ఎర్ర మట్టిని కొల్లగొడుతున్నారు. ఇక్కడి నుంచి ఎర్రమట్టిని విజయనగరం జిల్లా రేగిడి మండలంలో పలు గ్రామాల్లో వెలుస్తున్న రియల్ ఎస్టేట్‌లకు తరలిస్తున్నారు. మండలంలోని పెద్దపేట, కొండపేట మధ్యలో ఎర్రమట్టిని ఇదే మండలంలోని తుడ్డలిలో రియల్ ఎస్టేట్‌కు తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇష్టరాజ్యంగా మట్టిని తవ్వకొని తరలించడంలో భారీ వృక్షాలు సైతం నేల కొరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఎర్రమట్టిని ఎలా తరలిస్తున్నారని సంబంధిత వ్యక్తులను గ్రామస్తులు ప్రశ్నించగా తాము రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు పొందామని చెబుతున్నారని గ్రామస్తులు తెలిపారు.

టాక్టర్‌తో తరలిస్తున్న మట్టి

ఎర్రమట్టిని ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న ప్రొక్లెయినర్

ఏదిఏమైనా మండలంలో ఇంత పెద్దఎత్తున మట్టిని తరలిస్తున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మట్టి తరలింపును అడ్డుకోవాలని, అలాగే రెవెన్యూ శాఖ అధికారుల తీరును పరిశీలించి తగుచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

కంపు కొడుతున్న కిష్టప్పపేట

- బోరు చుట్టూ మురుగునీరు
- ఎక్కడ చూసినా చెత్తకుప్పలే

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మండలంలోని కిష్టప్ప పేటలో ఎక్కడ చూసిన చెత్త కుప్పలు దర్శన మిస్తున్నాయి. తాగునీరు బోరు చుట్టూ మురుగునీరు దర్శనమిస్తుంది. ఎమ్మెల్యే గొండు శంకర్ తన సొంత గ్రామంలోనే ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, తాగునీరు చుట్టూ మురుగు నీరు దర్శన మిస్తుండడంతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఎమ్మెల్యే సొంత గ్రామంలోనే చెత్తాచెదారాలు ఉంటే మిగిలిన పంచాయతీలు ఏ విధంగా ఉంటాయో అర్థం కావడం లేదని దీంతో పంచాయతీ సిబ్బంది పనితీరుపై మండిపడుతున్నారు. చెత్తాచెదారాల వల్ల దోమల బాధ ఎక్కువగా అవుతుందని పలువురు ప్రజలు వాపోతున్నారు. మంచినీరు బోరు చుట్టూ మురుగు నీరు చేరడంతో మంచినీరు కూడా కలుషితమయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రోడ్డుపైనే మురుగునీరు



రోడ్డు పక్కన ఉన్న చెత్త

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నారాయణ మృతదేహం

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ ఆది ఆంధ్రా వీధిలో పినిమింటి నారాయణ (40) ఆదివారం విద్యాదాఘానికి గురై మృతి చెందారు. ఇంట్లోని టేబుల్ ఫ్యాన్ మరమ్మతులు చేస్తుండగా... విద్యుత్ సరఫరా అయ్యింది. వెంటనే షాక్‌కు గురై సంఘటనాస్థలంలోనే మృతి చెందారు. మృతుడు వృత్తిరీత్యా డ్రైవర్. మృతుడికి భార్య రాజు, కుమారుడు మహేష్, కుమార్తె కీర్తన ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆది ఆంధ్రా వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కోడిపందాల నిర్వాహకుల అరెస్టు

నౌపడ: సంతబొమ్మాళి మండలం మర్రిపాడులో కోడిపందాలు నిర్వహిస్తూ పట్టుబడిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు నౌపడ ఎస్ఐ నారాయణస్వామి తెలిపారు. గత కొద్ది రోజులుగా గుట్టుగా కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. నిర్వాహకుల నుంచి రూ.3,210 నగదు, నాలుగు కోళ్లు పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు.

దగ్ధమవుతున్న ట్రాక్టర్ ఇంజిన్, నూర్పు యంత్రం

ట్రాక్టర్, నూర్పు యంత్రం దగ్ధం

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ సాలిపేటలో ఆదివారం వరి నూర్పు యంత్రం ఇంజిన్‌లో షార్టు సర్క్యూట్ కావడంతో ట్రాక్టర్ ఇంజిన్, నూర్పు యంత్రంతో పాటు సమీపంలో ఉన్న వరిచేను కుప్పలు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... గ్రామానికి చెందిన మార్పు భూషణరావుకు చెందిన ఎకరా 30 సెంట్లు విస్తీర్ణంలో గల వరిచేను కోతకోసి కుప్పపెట్టి నూర్పుకు సిద్ధమయ్యారు. అయితే నూర్పు ప్రారంభించిన కొద్ది సమయంలోనే యంత్రం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. హతాశులైన బాధితులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. హరిశ్చంద్రపురానికి చెందిన బల్లి అప్పాలరాజుకు చెందిన ట్రాక్టర్‌తోపాటు నూర్పిడి యంత్రం, వరి చేను, పక్కన ఉన్న అవాల బారికివాడుకు చెందిన గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. అయితే గ్రామస్తుల సమాచారం మేరకు స్థానిక అగ్నిమాపక శకటంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని సంబంధిత అధికారులు అంచనా వేశారు.

సత్యంను సన్మానిస్తున్న యువత, స్వచ్ఛంద సేవకులు

పాత్రికేయ రంగానికే గుర్తింపు

కవిటి: ఉభయ తెలుగు రాష్ట్రాల ఉత్తమ జర్నలిస్టుగా ప్రజాశక్తి విలేకరి పూడి సత్యనారాయణ ఉగాది పురస్కారం అందుకోవడం పాత్రికేయ రంగానికే గుర్తింపు అని కవిటి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంజీ అన్నారు. మండలంలోని స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకులు, యువకుల ఆధ్వర్యాన స్థానిక ఉషోదయ యువజన సంఘం భవనంలో సత్యనారాయణను ఆదివారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాంజీ మాట్లాడుతూ విలువలతో కూడిన పాత్రికేయులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. మండలంలో ఎన్నో సామాజిక వార్తలతో పాటు సమస్యల పరిష్కారానికి కథనాలు రాస్తున్న సత్యనారాయణ ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు పూర్తి అర్హులన్నారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాండవ రామారావు, పాండవ చంద్రశేఖర్, బందరు కాళిదాస్, పొల్లాయి లక్ష్మణమూర్తి, బెందాళం తిరుమల కుమార్, తెప్పల మోహనరావు, పిరియా మనోజ్ పాల్గొన్నారు.

'ఉషోదయ' అధ్యక్షునిగా కృష్ణారావు



కృష్ణారావు

కవిటి: ఉషోదయ యువజన సంఘం అధ్యక్షునిగా ఆరింగి కృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ఉషోదయ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్ను కున్నారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షునిగా బెందాలం చక్రధర్, కార్యదర్శిగా పొల్లాయి రుద్రయ్య, సహ కార్యదర్శిగా పి.ఉమాపతి, కోశాధికారిగా మొర్రి ఆదినారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బెందాలం అబ్బాయి, సాంస్కృతిక కార్యదర్శిగా మొగలిపురి ఢిల్లీశ్వరరావు, క్రీడా కార్యదర్శిగా నవీన్ కుమార్, మీడియా కన్వీనర్‌గా పిన్నింటి సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి ఉషోదయ యువ జన సంఘం సభ్యులు, మాజీ కార్యవర్గసభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వజ్రపుకొత్తూరు: 2025-26 విద్యా సమత్సరానికి ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ బి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధన 12సి ప్రకారం ప్రతి తల్లితండ్రులూ దీనిని పాటించాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసిన తరువాత పాఠశాలలను సంప్రదించాలని కోరారు.

బెల్లుపడాలో మహాయజ్ఞం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణం బెల్లుపడాలో తారక రామా మహాయజ్ఞం ఆదివారం నిర్వహించారు. ఈ యజ్ఞంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పాల్గొన్నారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. తొమ్మిదేళ్ల ఒకసారి నిర్వహించే మహాయజ్ఞం ఈ ఏడాదీ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.